# చదువు

నైపుణ్య

ఈనాడు
హైదరాబాద్
మంగళవారం మార్చి 13, 2018
■ e-mail: edc@eenadu.in



**చదువుల్లో చాలా మార్కులు వచ్చాయి.. చాలదు! టెక్నికల్‌గా టాప్ లేపేస్తానంటారా.. ఫర్వాలేదు! కష్టపడటానికి కాస్త కూడా వెనకాడరు.. ఓ..ఓకే! ఇంకేం.. కెరియర్‌కి తిరుగులేదనుకుంటున్నారా? లాభం లేదు.. ఇంకా కావాలి. అంతకుమించి.. ఇంకేవో ఉండాలి. ఏంటవి? అవే 'బిజినెస్ స్కిల్స్'. అభ్యర్థుల్లో పరిశ్రమలు పరిశోధిస్తున్న కార్పొరేట్ నైపుణ్యాలు. డిగ్రీ పట్టాతో ఉద్యోగ వేట మొదలు పెట్టిన వాళ్లూ, కొత్తగా కొలువులోకి ప్రవేశించి ఎదుగుదలకు ఎదురుచూస్తున్న వాళ్లూ వీటిని తప్పనిసరిగా మెరుగుపరచుకోవాలని 'మాన్‌స్టర్' సంస్థ మరీమరీ చెబుతోంది.**



# కెరియర్‌లో దూసుకెళ్దాం!

ఏ కెరియర్‌ను ప్రారంభిస్తున్నా దానిలో విజయం సాధించాలంటే కొన్ని నైపుణ్యాలు అవసరమవుతాయి. ఇవి ఉంటే వృత్తిలో విజయవంతం కావొచ్చు. భవిష్యత్తులో పదోన్నతులు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. చేసుకున్న విజ్ఞప్తులు ఫలించే వీలుంటుంది.

ఫలానా పరిశ్రమలో పనిచేస్తున్నారనేదానితో సంబంధం లేకుండా ఈ నైపుణ్యాలు ఎవరికైనా అవసరమే. ప్రతి ఒక్కరిలో ఇవి ఎంతో కొంత ఉంటాయి. వాటిని మెరుగుపర్చుకోవడమూ, మిగతావి నేర్చుకోవడమూ చేస్తే కెరియర్‌లో దూసుకువెళ్ళవచ్చు.

## టీం వర్క్, పీపుల్ స్కిల్స్

**ఎందుకు?:** తన అవసరాన్ని గుర్తించిన వెంటనే సాయపడటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారిని బృందంలోని ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. అలాగే తోటి ఉద్యోగులతోనూ కలిసిపోవాలి. అప్పుడే ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం దొరుకుతుంది. సొసైటీ ఫర్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ జరిపిన సర్వేలో 83% ఉద్యోగులు టీం వర్క్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా ప్రారంభ స్థాయి ఉద్యోగులకు ఇది ప్రధానమని వారు చెప్పారు.

**ఎలా?:** ఈ నైపుణ్యాలు పెంచుకోవాలంటే మంచి శ్రోత అవ్వాలి. ముఖ్యంగా అంతిమ ఫలితాల గురించి ఆలోచిస్తూ ఆందోళన, ఒత్తిడులకు గురవుతూ వాటి నుంచి బయటపడాలనుకునే సహోద్యోగులు చెప్పేది ఆలకించాలి. తోటి ఉద్యోగులు వచ్చి సాయాన్ని అర్థించేవరకూ ఆగకుండా చొరవ చూపి, ఇష్టపూర్వకంగా వారికి సాయం చేయాలి.



అలాగే తోటివారితో సంబంధాలు యాంత్రికంగా ఉండకూడదు. వారిపై నిజమైన ఆసక్తిని చూపి, వారితో కలిసిమెలిసివుండాలి.

మీ పరిజ్ఞానాన్ని బృందంతో పంచుకోవాలి. కాన్ఫరెన్స్‌లు, నెట్‌వర్కింగ్ ఈవెంట్లు, ఇండస్ట్రీ గురించిన సమాచారాన్ని చదువుతున్నపుడు మీకు ఆసక్తి కలిగించిన అంశాలను వారితో పంచుకోవాలి. పరస్పర సహకారం ఎప్పుడూ అనుకూల ఫలితాలను అందిస్తుంది.

## నెగోషియేటింగ్

**ఎందుకు:** కావాల్సినదాన్ని దక్కించుకోవడానికి అనునయాత్మకంగా ఉండటం అవసరం. అది ఎప్పుడు ఎలా ఉండాలో విద్యార్థులూ, అభ్యర్థులూ తెలుసుకోవాలి. ముఖ్యంగా జాబ్ ఆఫర్ పొందడంలో, నిధులను సమకూర్చుకునే సందర్భంలో ఈ నైపుణ్యాలు ఉపయోగపడతాయి.

కెరియర్ ప్రారంభంలోనే మంచి నెగోషియేటర్‌గా మారడం ప్రధానం అంటారు రాబిన్ పింక్లే. ఆమె 'గెట్ పెయిడ్ వాట్ యూఆర్ వర్త్: ద ఎక్స్‌పర్ట్ నెగోషియేటర్స్ గైడ్ టూ శాలరీ అండ్ కాంపెన్‌సేషన్' అనే ప్రసిద్ధ పుస్తక సహ రచయిత. చాలావరకూ వేతన పెరుగుదల ప్రారంభ జీతంపైనే ఆధారపడి ఉంటాయి. ఇది గుర్తిస్తే ఈ అంశం ఎంత ప్రధానమైనదో అర్థమవుతుంది.

వేరే ఉద్యోగానికి బదిలీ అవుతున్నప్పుడు పని నియమావళిలో అనుకూలతలు, అక్కడి ప్రోత్సాహకాలు, ప్రయోజనాలు పొందడంలో ఈ నైపుణ్యాలు తోడ్పడతాయి.

**ఎలా?:** శాలరీ నెగోషియేషన్స్ కోసం ముందుగా అందుకు అవసరమైన సమాచారాన్ని సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. మీ విద్య, నైపుణ్యాలు, అనుభవంతో పరిశ్రమలో సగటున ఎంత మొత్తంలో పొందుతున్నారో తెలుసుకోవాలి. ఇందుకుగానూ మెంటర్ సహకారం తీసుకోవచ్చు. లేదా ఆన్‌లైన్‌లో ఎంత జీతానికి మీకు అర్హత ఉందో నిర్ధారించుకోవాలి. వీటన్నింటి సాయంతో మీ అభ్యర్థనను బలపరచుకోవచ్చు.

## సమయ నిర్వహణ

**ఎందుకు:** సమయం అంటే ఒక రకంగా డబ్బు అని చెప్పవచ్చు. 'మీ పని నాణ్యత కచ్చితంగా కీలకమే అయినప్పటికీ సమయం కూడా ప్రధానం' అంటారు జూలీ మార్గెన్‌స్టర్న్. 'టైం మేనేజ్‌మెంట్ ఫ్రం ద ఇన్‌సైడ్ అవుట్' రచయిత్రి ఈమె. మేనేజర్లు ఉద్యోగుల నుంచి ఎప్పుడూ మంచి పనితనాన్ని ఎక్కువ మొత్తంలో ఆశిస్తుంటారు. అందుకే సమయ నిర్వహణ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. దీని ద్వారా తక్కువ స్థాయి కార్యక్రమాలపై ఎక్కువ శక్తిని ఖర్చు చేయకుండా నిరోధించుకోవచ్చు.

**ఎలా?:** మీ దృష్టిని ఎక్కడ కేంద్రీకరించాలో తెలియాలంటే.. ముందుగా మేనేజర్ నుంచి తుది గడువులు, విజయాన్ని గణించే పద్ధతుల వివరాలు తెలుసుకోవాలి. ఒకసారి ఆ సమాచారాన్ని సేకరించుకుంటే.. మీ పనిలో ఏయే విషయాలకు ప్రాధాన్యమిచ్చి దృష్టి సారించాలి, వేటిని ముందస్తుగా పూర్తిచేయాలనే అంశాలపై స్పష్టత వస్తుంది.

## బహిరంగ ప్రసంగ కళ

**ఎందుకు?:** మిమ్మల్ని మీరు సమర్థులుగా, స్నేహభావం గల వ్యక్తిగా నిరూపించుకోవడానికి ఈ నైపుణ్యాలు అవసరమవుతాయి. పబ్లిక్ స్పీకింగ్ కోచ్, కెన్నెడీ స్పీచ్ కమ్యూనికేషన్స్ ఫౌండర్, కెన్నెడీ అభిప్రాయం ప్రకారం.. 'పెద్ద సంఖ్యలో ఉన్న ప్రేక్షకుల ముందు ఉన్నా, చిన్న బృంద సభ్యుల మధ్య ఉన్నా మీరు చెప్పాలనుకున్న విషయాన్ని వ్యక్తపరచడం, మీ భావాలను స్పష్టంగా తెలియజేయడం కొంచెం కష్టమే'.

**ఎలా?:** బృంద సమావేశాల్లో ప్రెజెంటేషన్లను ఉపయోగించడం ద్వారా పబ్లిక్ స్పీకింగ్ నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చు. ప్రెజెంటేషన్ దగ్గర పడుతున్న కొద్దీ విద్యార్థులకైనా, ఉద్యోగులకైనా కాస్త బెరుకు సహజం. ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే.. మీరు ఏం చెబుతారు? ఎలా చెబుతారు? సంబంధిత సమాచారాన్ని ప్రేక్షకులు ఎలా తీసుకుంటారు? అనేవి పూర్తిగా మీ అధీనంలోనే ఉంటాయి. కాకపోతే ప్రతీ ప్రెజెంటేషన్ తరువాత మీ ఉన్నతాధికారి నుంచి ఫీడ్‌బ్యాక్ తప్పకుండా తీసుకోవాలి.

### పరిశోధన

**ఎందుకు?:** సొంత కెరియర్ అభివృద్ధికీ, సంస్థ అభివృద్ధికీ తోడ్పడేలా విలువైన ఉద్యోగిగా గుర్తింపు పొందాలంటే.. పరిశ్రమలో చోటు చేసుకునే మార్పులపై అవగాహన ఉండాలి. ప్రముఖ బిజినెస్ కోచ్ రాచెల్ రిట్‌లాప్ ఇదే విషయం చెబుతారు.

ఈ కింది అంశాల ద్వారా మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవచ్చని ఆమె సూచించారు.

- సోషల్ మీడియాలో అందుబాటులో ఉండే ఇండస్ట్రీ గ్రూపులు, ఫోరాల్లో పాల్గొనడం
- సోషల్ మీడియాలో థాట్ లీడర్లను అనుసరించడం
- పోటీ సంస్థల సమాచారాన్ని తెలుసుకోవడానికి గూగుల్ అలర్ట్స్‌ను పెట్టుకోవడం
- ఇండస్ట్రీ పోడ్‌కాస్ట్‌లను వినడం
- ఇండస్ట్రీ న్యూస్‌లెటర్లకు సైన్ అప్ అవడం
- ట్రేడ్ పబ్లికేషన్స్‌కు సబ్‌స్క్రైబ్ అవడం
- వృత్తిగత సంఘాల్లో చేరడం
- ఇండస్ట్రీ కాన్ఫరెన్సులకు హాజరవడం

తద్వారా భవిష్యత్తులో ఇవ్వబోయే ప్రసంగాలను మెరుగుపరచుకోవచ్చు.

ఆఫీసు బయట ఈ నైపుణ్యాలను మెరుగుపరచుకునే అవకాశాలున్నాయి. పబ్లిక్ స్పీకింగ్ వర్క్‌షాప్‌లను నిర్వహించే టోస్ట్‌మాస్టర్ వంటి ఎన్నో సంస్థలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో చేరి నైపుణ్యాలకు పదును పెట్టుకోవచ్చు.

## గ్రాఫిక్ డిజైన్‌లో..

**తాజా ఇంటర్న్‌షిప్స్**

**>>> వెబ్ డెవలప్‌మెంట్**
సంస్థ: Hungama Digital Media Entertainment ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 10,000
లింకు: internshala.com/i/9558
గడువు: మార్చి 14, 2018
**అర్హతలు:** హెచ్‌టీఎంఎల్, సీ, డేటాస్ట్రక్చర్స్, సీ++ ప్రోగ్రామింగ్, ఐఓఎస్, ఆండ్రాయిడ్

**>>> గ్రాఫిక్ డిజైన్**
సంస్థ: Hungama Digital Media Entertainment
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 10,000
లింకు: internshala.com/i/9559
గడువు: మార్చి 14, 2018
**అర్హతలు:** సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ.

**>>> లైవ్ ఆపరేషన్స్**
సంస్థ: Uber ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 15,000
లింకు: internshala.com/i/9560
గడువు: మార్చి 14, 2018
**అర్హతలు:** ఎంఎస్ ఆఫీస్, ఇంగ్లిష్, హిందీ భాషల్లో నైపుణ్యం ఉన్నవారు.

**>>> లీడ్ జనరేషన్**
సంస్థ: Tata Community Initiatives Trust
ప్రదేశం: హైదరాబాద్ స్టైపెండ్: నెలకు రూ. 2000 లింకు: internshala.com/i/9561
గడువు: మార్చి 12, 2018
**అర్హతలు:** సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ.



**>>> అకౌంట్స్**
సంస్థ: Marico Limited ప్రదేశం: హైదరాబాద్ స్టైపెండ్: నెలకు రూ. 10,000
లింకు: internshala.com/i/9562
గడువు: మార్చి 9, 2018
**అర్హతలు:** ఎంఎస్ ఆఫీస్, అకౌంటింగ్, ఎంఎస్ ఎక్సెల్, ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

**>>> ఫైనాన్స్ అండ్ మార్కెటింగ్ ఎన్‌ఎస్‌ఈ**
సంస్థ: Star Fing ప్రదేశం: హైదరాబాద్, బెంగళూరు స్టైపెండ్: నెలకు రూ. 10,000-15,000
లింకు: internshala.com/i/9563
గడువు: మార్చి 10, 2018
**అర్హతలు:** సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్**

CREATING WEALTH FOR WELLBEING

సంస్థ: నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ఇండియా లిమిటెడ్, తమిళనాడు.
**పోస్టు:** ఇండస్ట్రియల్ ట్రైనీ (ఫైనాన్స్) **ఖాళీలు:** 50
**కాలవ్యవధి:** 12 నెలలు **స్టైపెండ్:** నెలకు రూ. 10,000
**అర్హత:** సీఏ/ సీఎంఏ ఇంటర్ ఉత్తీర్ణత. **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: అకడమిక్ ప్రతిభ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 27.03.2018
**వెబ్‌సైట్:** https://web.nlcindia.com/itf/

**మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్**

సంస్థ: మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, నాగ్‌పూర్ (మహారాష్ట్ర). **పోస్టు:** ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (కెమిస్ట్రీ)
**ఖాళీలు:** 13 **అర్హత:** ఎంఎస్సీ కెమిస్ట్రీ, గేట్-2017 స్కోరు.
**వయసు:** 28 ఏళ్లకు మించకూడదు. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా.
**ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 09.04.2018 నుంచి 08.05.2018 వరకు
**వెబ్‌సైట్:** http://www.mecl.gov.in/

### ప్రవేశాలు

**ఏపీఈసెట్ - 2018**

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY • ANANTAPUR • योग: कर्मसु कौशलम्

ఆంధ్రప్రదేశ్‌లోని వర్సిటీలు, వాటి అనుబంధ వృత్తి విద్య కళాశాలల్లో యూజీ కోర్సుల లేటరల్ ఎంట్రీకి నిర్వహించే పరీక్ష. జేఎన్‌టీయూ అనంతపురం ఈ పరీక్షను నిర్వహిస్తోంది. **కోర్సులు:** బీఈ/ బీటెక్/ బీఫార్మసీ. **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో డిప్లొమా, బీఎస్సీ (మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణత. **ప్రవేశపరీక్ష తేది:** 03.05.2018 **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 15.03.2018 నుంచి 21.04.2018 వరకు. **వెబ్‌సైట్:** http://sche.ap.gov.in

**టీఎస్ పీజీఈసెట్ - 2018**

TELANGANA STATE COUNCIL OF HIGHER EDUCATION

తెలంగాణ రాష్ట్రంలోని వర్సిటీలు, వాటి అనుబంధ వృత్తి విద్య కళాశాలల్లో పీజీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష.
**కోర్సులు:** ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్, గ్రాడ్యుయేట్ లెవెల్ ఫార్మాడీ (పీబీ). **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ, బీటెక్, బీఫార్మసీ, బీఆర్క్ ఉత్తీర్ణత. **ప్రవేశపరీక్ష తేది:** 2018 మే 28 నుంచి 31 వరకు. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 15.03.2018 http://pgecet.tsche.ac.in/

**ఏపీఐసెట్ - 2018**

ANDHRA PRADESH STATE COUNCIL OF HIGHER EDUCATION

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వర్సిటీలు, వాటి అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష.
**కోర్సులు:** ఎంబీఏ, ఎంసీఏ. **అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత. **ప్రవేశ పరీక్ష తేది:** 2018 మే 2. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 16.03.2018 నుంచి 24.04.2018 వరకు
**వెబ్‌సైట్:** http://sche.ap.gov.in/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**

# మెప్పించి సాధించే మెలకువలు



**త్వరలో ఏపీపీఎస్సీ గ్రూప్-I ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరగబోతున్నాయి. బోర్డు సభ్యులను మెప్పించేలా జవాబులు చెప్పి ఆశించిన ఉద్యోగం సాధించటానికి ఏమేం తెలుసుకోవాలి? వేటిపై దృష్టి పెట్టాలి? ఇటీవల గ్రూప్-I స్టేట్ టాపర్‌గా నిలిచిన ఆకుల వెంకటరమణ తన ఇంటర్వ్యూ అనుభవాల ప్రాతిపదికగా అభ్యర్థులకు ఇస్తున్న సూచనలు!**

## గ్రూప్-I ఇంటర్వ్యూ గైడెన్స్

మన గురించి క్షుణ్ణంగా తెలుసుకుని మనల్ని ప్రభావవంతంగా ఇంటర్వ్యూ బోర్డుకు పరిచయం చేసుకోవడమే ఇంటర్వ్యూ. అభ్యర్థులు గ్రూప్-1 క్యాడర్‌లోని అన్ని ఉద్యోగాల విధులూ, బాధ్యతలను తెలుసుకుని ఇంటర్వ్యూకు వెళ్ళటం శ్రేయస్కరం. పబ్లిక్ సర్వీసులో ఎందుకు చేరాలనుకుంటున్నారని అడిగితే తడబడకుండా చెప్పేంత స్పష్టతతో ఉండాలి.

మా కుటుంబ వ్యవసాయ నేపథ్యం, నేను వ్యవసాయ రంగంలో పనిచేయటం, అలాగే ఇటీవల వార్తల్లో, బడ్జెట్లో వ్యవసాయ సంబంధిత అంశాలు ఉండటం వల్ల నా ఇంటర్వ్యూలో 50 శాతానికి పైగా వ్యవసాయ సంబంధిత ప్రశ్నలు ఉండొచ్చని భావించాను. కానీ ఒక్క ప్రశ్న కూడా వ్యవసాయంపై అడగలేదు. అందువల్ల ఇంటర్వ్యూ జరిగేటప్పుడు మనం ఆశించిన ప్రశ్నలు రాలేదనేది ఆలోచించకూడదు. వేరే ఆలోచనలు దరిచేరనీయకుండా అడిగిన ప్రశ్నలకు కుదిరినంతగా మంచి సమాధానాలు స్పష్టంగా చెప్పాలి.

ఇంటర్వ్యూలో ఇచ్చే సమాధానాలు సూటిగా, స్పష్టంగా, అడిగిన ప్రశ్నకు సంబంధించినవై ఉండాలి. సానుకూల ధోరణి తప్పనిసరి. విశాల దృష్టితో, సమతూకంగా ఉంటే బోర్డు మెప్పు పొందవచ్చు. పక్షపాతం లేకుండా, లోతైన ఆలోచనలతో, ఆలోచనల్లో స్పష్టతతో మాట్లాడాలి. పక్షపాత ధోరణి ప్రదర్శించకూడదు. ధైర్యంగా చెప్పాలి, కానీ వ్యవస్థ మూలాలను ప్రశ్నించే ధోరణి పనికిరాదు. పొంతన లేకుండా.. వైరుధ్యాలతో మాట్లాడకుండా తార్కికంగా, హేతుబద్ధంగా జవాబులు చెప్పాలి.

### పరిధి మరిచి ప్రసంగించకూడదు

అభ్యర్థులు ఇంటర్వ్యూలో ఆవేశంతో రాజకీయ ప్రకటనలు చేయడం గానీ, సభ్యులనుద్దేశించి తన పరిధి మర్చిపోయి, ప్రసంగాలు చేయటం గానీ చేయకూడదు. అది చాలా నష్టదాయకం.

మనం చెప్పే సమాధానాలను మధ్యలోనే ఇంటర్వ్యూయర్ అర్థాంతరంగా ఆపేయవచ్చు. దీనికి ఆందోళన పడకూడదు. అభ్యర్థి మంచి జవాబు చెపుతుంటే సాధారణంగా ఇంటర్వ్యూయర్ మరో ప్రశ్నకు వెళ్లిపోతారు. అందుకని అలా మధ్యలో మన సమాధానం ఆపేయటం మంచి సూచనే. నా ఇంటర్వ్యూలో కూడా చాలాసార్లు మధ్యలో ఇలా కట్ చేశారు.

అభ్యర్థులు తమకు సౌకర్యమున్న భాషలో సమాధానాలు చెప్పవచ్చు. ఇంగ్లిష్, తెలుగు.. రెండు భాషల్లో కూడా కుదిరినంతగా చెప్పవచ్చు. ఒకవేళ ఆంగ్లంలోనే మాట్లాడాలని నిర్దేశిస్తే... కంగారుపడకూడదు. సింపుల్ ఇంగ్లిష్‌లో మాట్లాడటానికి ప్రయత్నించండి. మాట్లాడే ఇబ్బంది ఉన్నట్లయితే నేర్చుకుంటాననే సంసిద్ధత వ్యక్తం చేయాలి. అలాగే ఇప్పటివరకూ తగినంతగా నేర్చుకోని లోపాన్ని ఒప్పుకోవాలి. ఎందుకంటే గ్రూప్-1 స్థాయి ఉద్యోగులకు భవిష్యత్తులో ఆలిండియా సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్‌లుగా పదోన్నతి లభిస్తుంది. ప్రభుత్వ వ్యవహారాలు ఇంగ్లిష్‌లో జరుగుతాయి కదా?

◗ **అనూహ్యమైన ప్రశ్నలు సంధిస్తే?**

ఒక్కోసారి కావాలనే ఇంటర్వ్యూలో ఒత్తిడి కలగజేసే, వ్యతిరేక ప్రశ్నలను అడగవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఎలా స్పందించాలో తెలుసుకోవాలి.

ఇబ్బంది పెట్టే ప్రశ్నలకు 'తెలియదు' అనో, 'లేదు/ కాదు' అనో చెప్పవచ్చు. కానీ ఎప్పుడూ నటన పనికిరాదు. ఇబ్బందికర ప్రశ్నలు వేసినపుడు 'నాకు తెలిసినంతవరకూ' అంటూ పాక్షిక సమాధానాలు ఇవ్వవచ్చు.

◗ **'రోడ్డు విభాగం వారి ప్రణాళికలో భాగం కాని రహదారి నిర్మాణాన్ని అనుమతించమని ఓ ఎమ్మెల్యే మిమ్మల్ని అడిగారు. ఆయన ఒత్తిడికి మీరు లొంగుతారా?'** అని గతంలో గ్రూప్-1లో అడిగారు.

ఆ రోడ్డు నిర్మాణం చట్ట వ్యతిరేకం అయితే 'సాధ్యం కాదు' అని కచ్చితంగా చెప్పవచ్చు. కానీ అలాంటి పరిస్థితి లేనపుడు ఈ ప్రశ్నకు 'ఔను' అని గానీ 'లేదు' అని గానీ చెప్పటం సరికాదు. ప్రజా ప్రతినిధికి నిర్మొహమాటంగా 'లేద'ని కటువుగా జవాబు చెప్పటం ఆచరణీయం కాదు. అలా చేయకూడదు. ఆయన ప్రజల ఆకాంక్షను ప్రతిఫలిస్తున్నారని గమనించాలి. ఆయన ప్రతిపాదనకు తగిన గౌరవాన్నిచ్చి, చట్టాన్నీ, నిబంధనలనూ ఉల్లంఘించకుండా ఆయన వినతిని మన్నించడానికి ప్రయత్నించాలి.

గ్రూప్-1 ఇంటర్వ్యూలో నాలుగుసార్లు విఫలమైన అభ్యర్థిని 'కెరియర్లో, జీవితంలో మీరు ఫెయిలైనట్టు కాదా?' అని అడిగారు. ఇలాంటి ప్రశ్న మిమ్మల్ని అడిగితే ఆందోళన పడకూడదు. 'వివిధ కారణాల వల్ల ఎంపికవ్వటంలో జాప్యం జరగవచ్చు. ఇంతటి పోటీలో కూడా నేను వరసగా ఇంటర్వ్యూలకు సెలక్టవుతున్నానంటే నిలకడతో కూడిన నా మెరుగుదలను సూచిస్తుంది' అని చెప్పటం సముచితంగా ఉంటుంది. ఆ ప్రశ్నకు ఏ జవాబు చెప్పినా అది ఆశావహంగా ఉండాలి. అంతేకానీ, గత ఎంపికల తీరు గురించి వ్యతిరేకంగా మాట్లాడటం కానీ, మీపై మీరు సానుభూతిని ప్రదర్శించటం కానీ చేయకూడదు.

◗ ('వారాంతాల్లో ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు పాఠాలు చెప్పేవాణ్ని' అని నేను చెబితే... దానిపై అడిగిన ప్రశ్న.) **'ఇంజినీరింగ్ విద్యార్థులకు ట్యూషన్లు చెప్పి ఆ డబ్బుతో స్కూలు పిల్లలకు ట్యూటర్లను పెట్టవచ్చు కదా... మీ చదువుకు సార్థకత వచ్చేది. అలాగే స్కూలు పిల్లలకు ఉపయోగపడేది కదా? మీరు తప్పు చేయలేదా?'**

'మీరు చెప్పింది నిజమే సర్. కానీ ఇంజినీరింగ్ విద్యార్థులు నిజంగా నేర్చుకోవాలంటే ఎన్నో అవకాశాలు ఉచితంగా లభిస్తున్నాయి. నేను బీటెక్ చదివేటప్పుడూ, ఇంజినీరింగ్ ఉద్యోగం చేసేటప్పుడూ యూట్యూబ్‌లో ఎంఐటీ, కాలిఫోర్నియా లాంటి యూనివర్సిటీల ప్రొఫెసర్ల లెక్చర్లను ఉచితంగా వినేవాడిని. నేను వారికంటే గొప్పగా చెప్పగలను అనుకోవటం లేదు. ఇంజినీరింగ్ విద్యార్థులకు కావలసింది ఆసక్తి మాత్రమే. అందుకే ప్రభుత్వ స్కూలులో వెనకబడిన విద్యార్థుల విషయంలో వారికి అందుబాటులో లేని నాణ్యమైన విద్యను నాదైన పద్ధతిలో అంటే.. ప్రశ్నించే తరహాలో అందజేశాను'.

◗ **'మీరు ప్రభుత్వోద్యోగంలో చేరితే లంచం తీసుకోరు, ప్రజాసేవ చేస్తారు అని ఎలా నమ్మాలి?'**

'భవిష్యత్తులో నేను అవినీతికి పాల్పడతానో లేదో అన్నది నేనిప్పుడు వర్తమానంలో నిరూపించలేను. కానీ నేను ఇంతవరకూ నడిచిన నా దారిని మాత్రం చెప్పగలను. దాన్నిబట్టి నా గురించి ఒక అంచనాకు రావచ్చును..' అంటూ వాస్తవంగా చేసిన సేవాకార్యక్రమాల వివరాలు చెప్పవచ్చు.

◗ **'మీ గౌరవనీయమైన వృత్తిని మీరెందుకు వదలాలనుకుంటున్నారు?'** (టీచర్లనూ, డాక్టర్లనూ అడిగిన ప్రశ్న..)

'ఒక వ్యక్తి స్థాయిలో లేదా ఒక సంస్థ స్థాయిలో పనిచేసి సమాజంపై చూపించే ప్రభావం కన్నా గ్రూప్-1 స్థాయిలో మరింతమంది టీచర్లనూ, ప్రభుత్వ వైద్యులనూ మెరుగైన ప్రజాసేవకు ప్రోత్సహించవచ్చు. సమాజంలో తద్వారా గుణాత్మక మార్పులను తీసుకురావొచ్చు'.

**పబ్లిక్ సర్వీస్ కమిషన్ అభ్యర్థుల నుంచి ఆశించే లక్షణాలు**

❑ నాయకత్వ లక్షణాలు ❑ రాజ్యాంగ స్ఫూర్తి ❑ ప్రజానుకూల ధోరణి (సమానత్వం, భావ స్వేచ్ఛ, సామాజిక న్యాయం, వ్యక్తి గౌరవం, ప్రజాస్వామిక వైఖరి, జాతీయ సమైక్యత..దీనిలో భాగం) ❑ సంక్షేమం, సాధికారత రెండిటిపై అవగాహన ❑ స్వభావంలో నమ్రత.

TG